ఓజోన్ పొర పరిరక్షణ బాధ్యత అందరిది

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 3 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఓజోన్ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు, మట్టి వినాయక విగ్రహాలను తయారు చేసే పోటీలను నిర్వహించారు. నేషన్ గ్రీన్‌కోర్ క్లస్టర్ కో ఆర్డినేటర్ విజయమోహన్ రెడ్డి మాట్లాడుతూ శీతలీకరణ యంత్రాల ద్వారా, పరిశ్రమల నుంచి వచ్చే క్లోరోఫ్లోరో కార్బన్ ద్వారా ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. చెట్లను విరివిగా పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు చాంద్‌బాషా, కవిత, ఖాజాపీర్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

■ రామేశ్వరం ఎస్పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించిన ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవంలో జిల్లా సైన్స్ సమన్వయకర్త డీవీఎస్ నాయుడు పాల్గొన్నారు. సూర్యుని నుంచి వచ్చే ప్రమాదకరమైన అతి నీలలోహిత కిరణాలను ఓజోన్ పొర అడ్డుకుని రక్షణగా ఉంటుందన్నారు. కాలుష్యం, ఏసీ తదితర వాటిని ఎక్కువగా ఉపయోగించడం వల్ల ఓజోన్ పొర దెబ్బతింటోందన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యబాబు, సీవీ రామన్ సైన్స్ క్లబ్ కార్యదర్శి దామోదర్, ఉపాధ్యాయులు ఇంద్రలత, లక్ష్మీనారాయణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : ఓజోన్ పొరను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి తెలిపారు. కళాశాలలో శనివారం ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక కాలుష్యం వల్ల ఓజోన్ పొర క్షీణిస్తోందని, ఇది మానవాళికి పెనుముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. జంతుశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ నరసింహారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పీవీ కృష్ణారెడ్డి ఓజోన్ పొర పరిరక్షణలో మన పాత్ర అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

జెడ్పీ హైస్కూల్‌లో..

మైదుకూరులోని జెడ్పీ హైస్కూల్ (బాలుర)లో ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మణిప్రకాష్ ఆధ్వర్యంలో ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులు గోశెట్టి రామ్మోహన్, సురేంద్ర నాయక్ పిల్లలకు ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఓజోన్ పొరను కాపాడుకుందాం అనే అంశంపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణరెడ్డి, తవ్వా ఓబుళరెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ, నాటిక ప్రదర్శన

పోరుమామిళ్ల: ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని శ్రీ వైష్ణవి ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఫ్లెక్సీలు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ ఆర్టీసీ బస్టాండు వరకు నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద విద్యార్థులు 'భూమి మనుగడ– తీసుకోవలసిన జాగ్రత్తలు' అంశంపై లఘునాటిక ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకులు రామాంజులు, కరస్పాండెంట్ రామకృష్ణ, ప్రిన్సిపాల్ మల్లికార్జున మాట్లాడుతూ మానవ మనుగడకు ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు పెంచాలన్నారు. డైరెక్టర్ కళ్యాణి, వైస్ ప్రిన్సిపాల్ హరిదాసు, కేశవరాయుడు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్:కల్లూరు హైస్కూల్‌లో మట్టి వినాయకులతో విద్యార్థులు



ఎస్పీసీఎస్ మున్సిపల్ హైస్కూల్‌లో ఓజోన్ పొరపై విద్యార్థుల పెయింటింగ్స్



మైదుకూరు:జెడ్పీ హైస్కూల్‌లో బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు



పోరుమామిళ్లఆర్టీసీ బస్టాండులో విద్యార్థుల ప్రదర్శన

క్లుప్తంగా

నేడు విశ్వకర్మ జయంతి

బ్రహ్మంగారిమఠం : విశ్వకర్మ జయంతి వేడుకలు ఆదివారం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వకర్మ జయంతి ఉత్సవాల్లో మండలంలోని విశ్వబ్రాహ్మణులు అందరూ పాల్గొనాలని కోరారు.

ఘనంగా ముందస్తు వినాయక చవితి వేడుకలు



వినాయక వేషధారణలో విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాంజలి హైస్కూల్‌లో శనివారం ముందస్తు వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వినాయకుల, పార్వతీదేవి వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సూర్యకుమారి విద్యార్థులకు వినాయక చవితి విశిష్టతను, ప్రాముఖ్యతను వివరించారు.

వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజి విద్యార్థిని ప్రతిభ



బహుమతి అందుకుంటున్న మీనాకుమారి

ప్రొద్దుటూరు : స్థానిక వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజిలో కంప్యూటర్ సైన్స్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మీనాకుమారి వ్యాసరచన పోటీలో ప్రతిభ చూపిందని కాలేజి ప్రిన్సిపాల్ సి.నాగరాజు తెలిపారు. కడపలో ది ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మీనాకుమారి ప్రతిభ చూపి ద్వితీయ బహుమతి గెలుపొందినట్లు ఆయన పేర్కొన్నారు. ద్వితీయ బహుమతి రూ.1,500, ప్రశంసాపత్రాన్ని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ ఎస్.రమణ విద్యార్థినికి అందించారని చెప్పారు. విద్యార్థినిని ప్రిన్సిపాల్ తోపాటు డీన్ ప్రొఫెసర్ కేవీ రమణయ్య అభినందించారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అమ్మనాన్న వృద్ధాశ్రమానికి చెందిన పాలాది సంజమ్మ అనే వృద్ధురాలు, జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పి.శ్రీను(40) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందారు. వీరికి అంత్యక్రియలు నిర్వహించడానికి ఎవరు లేకపోవడంతో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావుకు సమాచారం అందించారు. ఆయన తమ ఫౌండేషన్ సభ్యులతో కలసి వారి మృతదేహాలకు శనివారం హిందూ శ్మశాన వాటికలో సంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృప అగ్ని షారూన్ ట్రస్టు చైర్మన్ పాపిశెట్టి వెంకటలక్షుమ్మ, కె.సుమన్ బాబు, భార్గవ్ సాయి, సుభహాన్, తిరుపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు పారదర్శకంగా చేపట్టాలి

అట్లూరు : పంట నమోదును పారదర్శకంగా చేపట్టాలని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. శనివారం మండలంలోని కాటంవారిపల్లె, నారాయణపేట గ్రామాల్లో ఉప్పతి సుబ్బారెడ్డి, షేక్ అటిల్‌సాహెబ్, మన్నెం పాండురంగారెడ్డి, కల్లూరు శ్రీనివాసులురెడ్డి, మన్నెం ఆదిలక్షుమ్మ తదితర రైతుల పొలాల్లో జరుగుతున్న పంట నమోదును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటలను ఈ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఆర్బీకే సిబ్బంది మందపల్లి కుమార్, రైతులు పాల్గొన్నారు.

దోమ కాటుతో మలేరియా, డెంగీ వ్యాపించే అవకాశం

ప్రొద్దుటూరు క్రైం :దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ వ్యాధులు వస్తాయని సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఎర్రన్నకొట్టాలలో డెంగీ కేసు నమోదు అయింది. దీంతో వైద్యాధికారులు ఆ ప్రాంతంలో శనివారం ఫీవర్ సర్వే నిర్వహించారు. నీరు నిల్వ ఉన్న చోట అబేట్ మందును పిచికారీ చేశారు. మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే దోమ కాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. జ్వరాలు వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరూ సమీప ఆసుపత్రులకు వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. డాక్టర్ దినేష్‌బాబు, సీఓ నాగజ్యోతి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గోపవరం/రాజుపాళెం : గోపవరం మండలంలోని వల్లెరవారిపల్లెలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, రాజుపాళెం మండలం వెల్లాల గ్రామంలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాముల ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

బ్రహ్మంగారిమఠం : వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరని ఎస్ఐ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులపేర్లు, రెవిన్యూ, విద్యుత్, అగ్నిమాపక అధికారుల అనుమతులతో పోలీసుల దగ్గరకు రావాలన్నారు. వినాయక మండపాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేస్తున్నారనేది ముందుగా తెలపాలన్నారు.

సొసైటీని సద్వినియోగం చేసుకోండి

బి.కోడూరు : మండలంలో నూతనంగా ఏర్పాటవుతున్న దుర్గ రైతు ఉత్పత్తిదారుల సొసైటీని సద్వినియోగం చేసుకుని మండల రైతులు ఆర్థికంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి చెందాలని నాబార్డు డీజీఎం విజయవిహారి తెలిపారు. శనివారం మండల కేంద్రమైన బి.కోడూరులో ఎల్‌డీఎం దుర్గప్రసాద్ ఆధ్వర్యంలో దుర్గ రైతు ఉత్పత్తిదారుల సొసైటీ వారు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఆయన మాట్లాడుతూ ఈ సొసైటీ ద్వారా మిల్లెట్స్, రాగి తదితర పంటలను రైతులు సాగుచేసుకుంటే ఆర్థికంగా తోడ్పాటు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీబీబీఓ బి.వి.రత్నం, స్థానిక నాయకులు దుగ్గిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

19న టీఓపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: అన్నవరం గ్రామ సచివాలయ పరిధిలోని టీఓపల్లె గ్రామంలో ఈ నెల 19న ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైభవంగా గణపతి మహోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శివాలయం గణపతి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో 47వ గణపతి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. శనివారం శివాలయంలో ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది హోస్పేట, కోల్‌కతా వారితో 18 అడుగుల పంచవింశతిముఖ మహాగణపతిని మట్టితో రూపొందించామన్నారు. 25 తలలు, 50 చేతులతో విగ్రహాన్ని తయారుచేశారన్నారు. ఈనెల 22న శుక్రవారం సాయంత్రం గ్రామోత్సవం , శనివారం 10 గంటలకు శివాలయం ప్రాంగణంలో నిమజ్జనం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో గణపతి మహోత్సవ కమిటీ ఉపాధ్యక్షుడు నగరూరు చంద్రగుప్త, కార్యదర్శి అట్ల నరసింహారెడ్డి, సహాయ కార్యదర్శి రాంపుల్లయ్య, నిర్వాహక కార్యదర్శి గోనా ప్రభాకర్‌రెడ్డి, కోశాధికారి తెల్లాకుల వీరసుబ్రహ్మణ్యం, ముత్యాల సేతురావు, ఓబులేసు, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రాలను విడుదల చేస్తున్న గణపతి మహోత్సవ కమిటీ ప్రతినిధులు

పర్లపాడు మీదుగా చాగలమర్రికి బస్సు సౌకర్యం కల్పించండి

ప్రొద్దుటూరు క్రైం : రాజుపాళెం మండలంలోని పర్లపాడు మీదుగా చాగలమర్రికి ఆర్టీసీ బస్సును నడపాలని ఆ ప్రాంత ప్రజలు ప్రొద్దుటూరు ఆర్టీసీ డీఎం మల్లికార్జునరెడ్డిని కోరారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో భాగంగా శనివారం పలువురు ఫోన్ చేసి అడిగిన ప్రశ్నలకు డిపో మేనేజర్ సమాధానాలు ఇచ్చారు. తగినన్ని బస్సులు లేని కారణంగా పర్లపాడు మీదుగా చాగలమర్రికి బస్సు నడపడం సాధ్యం కాదని డీఎం తెలిపారు. అలాగే ప్రొద్దుటూరులోని రామేశ్వరం నుంచి బస్సులు తిప్పాలని కోరగా.. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్నందున బస్సులు నడపలేమని డీఎం చెప్పారు. పోరుమామిళ్ల, గిద్దలూరు, బి మఠంలకు బస్సులు కావాలని ఆ ప్రాంత ప్రజలు అడిగారు. పోరుమామిళ్లకు ఉదయం 8.45, 11.00, మధ్యాహ్నం 1 గంటకు, 2 గంటలకు, 3.15 నిమిషాలకు బస్సు సర్వీసులు తిరుగుతున్నాయని, అలాగే బి మఠానికి ఉదయం 10 గంటలకు బస్సు నడుస్తున్నట్లు చెప్పారు. ఉదయం 5 నుంచి 5.30 మధ్య యర్రగుంట్ల నుంచి ప్రొద్దుటూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు అడిగిన ప్రశ్నకు పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ సమాధానమిచ్చారు. మండల కేంద్రమైన రాజుపాళెం బస్టాండులోకి అన్ని బస్సులు వచ్చేలా చూడాలని కోరగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

ఆర్టీసీ లక్కీడిప్ విజేతల ఎంపిక



లక్కీడిప్ తీస్తున్న ఎస్‌బీఐ అసిస్టెంట్ మేనేజర్ హారిక



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆర్టీసీ డీఎం

మైదుకూరు : మైదుకూరు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సుల్లో ప్రయాణించే వారి కోసం ఏర్పాటు చేసిన లక్కీడిప్ విజేతలను శనివారం ఎంపిక చేశారు. మైదుకూరు డిపోకు చెందిన బస్సుల్లో సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు, 16 నుంచి 30 వరకు మైదుకూరు – గిద్దలూరు, కడప – పోరుమామిళ్ల రూట్‌లలో ప్రయాణించే వారి కోసం లక్కీ డిప్ స్కీంను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సమక్షంలో డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రయాణికుల టికెట్ల నుంచి మైదుకూరు స్టేట్ బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ హారిక, ఉద్యోగిని శాంతి విజేతలను ఎంపిక చేశారు. మైదుకూరు – గిద్దలూరు రూట్‌లో మొదటి మూడు బహుమతులను గిద్దలూరు మొర్రాయిపల్లెకు చెందిన కళ్యాణ్, ఉయ్యాలవాడకు చెందిన వై.కార్తీక్, వంకమర్రికి చెందిన జి.గంగయ్య గెలుచుకున్నారు. కడప–పోరుమామిళ్ల రూట్‌లో పోరుమామిళ్లకు చెందిన కె.సిద్దయ్య, మైదుకూరులోని శెట్టివారిపల్లెకు చెందిన కె.పవన్, మైదుకూరు పట్టణంలోని శ్రీరామ్ నగర్‌కు చెందిన కె.అనిల్ కుమార్ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. డిపో అధికారులు సరోజ, వెంకటేశ్వర్లు, లక్షుమయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆదాయం పెంచడమే లక్ష్యం

బద్వేలు అర్బన్ : ఆర్టీసీ ఆదాయం పెంచడంతో పాటు ఆర్టీసీని ప్రయాణికులకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతోనే గిఫ్ట్‌స్కీం విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం జె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బద్వేలు – కడప మార్గంలో పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు బస్సులలో ఏర్పాటు చేసిన గిఫ్ట్‌స్కీం డిప్‌ను శనివారం తీసి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని చెప్పారు. గిఫ్ట్‌స్కీంలో పి.వెంకటసుబ్బయ్య, లక్ష్మి, తిరుపాల్‌లు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను కైవసం చేసుకున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి పూర్తి భరోసా

ప్రొద్దుటూరు క్రైం : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజల ఆరోగ్యానికి పూర్తి భరోసా లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని అరవిందాశ్రమం, సుబ్బిరెడ్డి కొట్టాలలో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శనివారం నుంచి ఇంటింటి సర్వే కార్యక్రమం మొదలైందన్నారు. ఈ సర్వేలో ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య స్థితి గతులను తెలుసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. సర్వేలో బీపీ, షుగర్ పరీక్షలతో పాటు జ్వరం ఉన్న వారికి మలేరియా, డెంగీ పరీక్షలు, రెండు వారాల మించి దగ్గు ఉంటే గళ్ల పరీక్షలు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి హిమబిందు, హెల్త్‌ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సీఓ ఎంపీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

మైదుకూరు : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మైదుకూరు పట్టణంలోని శివునిమాన్యం వీధిలో శనివారం జరుగుతున్న సర్వే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు తనిఖీ చేసి, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సర్వే మొదలైందన్నారు. ప్రతి కుటుంబాన్ని సందర్శించి కుటుంబంలో దీర్ఘకాలికంగా ఉన్న రోగులను నమోదు చేసుకుని ఈనెల 30 నుంచి ప్రారంభం అవుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు తరలించి చికిత్స అందిస్తారన్నారు.



వివరాలను నమోదు చేసుకుంటున్న ఆరోగ్యశాఖ అధికారులు

సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలో సంతోషం కనిపిస్తోందని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులోని రామాపురంలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్య, వైద్యం, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటు దేశంలో ఎక్కడా అమలులో లేని సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అమలు చేస్తున్నారన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఇప్పటికే ప్రతి కుటుంబానికి రూ.1.50 లక్షల నుండి రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరిందని, మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఇంత మంచి పరిపాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు వివేక్‌రెడ్డి, చెంచయ్య, సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఓబుళాపురం, పిట్టిగుంట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు అందిన పథకాలకు సంబంధించి బుక్‌లెట్ అందజేసి వివరించారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కొంత మంది సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ముజఫర్‌రహీమ్, సచివాలయాల మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, స్థానిక సర్పంచ్ జయమ్మ, ఎంపీటీసీ సీతాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బద్వేలు అర్బన్: లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలు

మైదుకూరు : మైదుకూరులోని సిండికేట్ రైతు సేవా సహకార సంఘం తన పరిధిలోని రైతులకు స్వల్ప, దీర్ఘకాలిక పంట రుణాలను మంజూరు చేయనుంది. శనివారం సంఘం అధ్యక్షుడు మూలే సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులకు పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ స్వల్పకాలిక రుణాల కింద రూ.3లక్షల వరకు, దీర్ఘకాలిక రుణాల కింద రూ.20లక్షల వరకు రుణాలను ఇవ్వనున్నట్లు తెలిపారు. పంట రుణాలు తీసుకున్న వారు ఏడాది లోపల తిరిగి చెల్లిస్తే 7 శాతం వడ్డీ ఇస్తామన్నారు. ఇందులో 3 శాతం ప్రభుత్వం నుంచి రాయితీ కూడా లభిస్తుందని పేర్కొన్నారు. గడువు లోపల చెల్లించని వారికి 13 శాతం వడ్డీ భారం పడుతుందని తెలిపారు. సంఘంలో బంగారంపై కూడా రుణాలను ఇస్తామని చెప్పారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని రాయలసీమ వ్యాయామ కళాశాలలో శనివారం నిర్వహించిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నియోజకవర్గస్థాయి క్రీడాపోటీలు విద్యార్థుల మధ్య ఉత్సాహంగా సాగాయి. అండర్–14, 17 బాలబాలికల విభాగంలో వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, త్రోబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, యోగా, టెన్నికాయిట్ విభాగాలలో పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నియోజకవర్గంలోని 600 మంది పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడా పోటీలను ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపాల్ రవిశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ముఖ్యమే అని అన్నారు. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు సుధాకర్, ప్రసాదరెడ్డి, ఓబయ్య, సుబ్బయ్య, షేక్ బాబు, లక్ష్మీదేవి, శ్యాముల్ తదితరులు పర్యవేక్షించారు.

నక్కలదిన్నెలో ముమ్మరంగా పీహెచ్‌సీ నిర్మాణ పనులు

చాపాడు: మండలంలోని నక్కలదిన్నె గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రోడ్లు మరియు భవనాల శాఖ నిధుల కింద రూ.2.50 కోట్లతో 4,802 చదరపు అడుగులలో పీహెచ్‌సీ నిర్మాణం జరుగుతున్నట్లు ఆర్ అండ్ బీ ఏఈ దాదాబాషా తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తి స్థాయిలో పనులు జరుగుతాయన్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా పాత గ్రామ సచివాలయం వద్ద పీహెచ్‌సీ సేవలను అందిస్తున్నారు. ప్రస్తుతం భవన నిర్మాణ పనులతో పాటు విశాలమైన ప్రహరీ పనులు సైతం జరుగుతున్నాయి. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి చొరవతో ఈ పీహెచ్‌సీ నిర్మాణం జరుగుతోందని, దీని ద్వారా నక్కలదిన్నె చుట్టు పక్కల గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం, వెదురూరు, నరహరిపురం, రాజువారిపేట, ఎన్.ఓబాయపల్లె, తిమ్మాయపల్లె, లక్ష్మీపేట, పెద్దగురువళూరు, చిన్నగురువళూరు, కేతవరం గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందనున్నాయి.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఆసుపత్రి హోమియో వైద్యురాలు ఎస్.రాజేశ్వరి పేర్కొన్నారు. స్థానిక హోమస్‌పేట ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉచిత హోమియో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రోజూ పాలు, పండ్లు, గుడ్లు, ఆకుకూరలు తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయాలన్నారు. పాఠశాలలోని 270 మంది విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు నివారణ హోమియో మందులను పంపిణీ చేశారు. మనప్రజా సేవాసమితి అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, ప్రధానోపాధ్యాయుడు రవీంద్రుడు, ఉపాధ్యాయులు నాగరాజు, సరళాదేవి, అరుణ, లక్ష్మీదేవి, పార్వతి, ఎంఎన్ఓ రమణ పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించడం తగదు

ప్రొద్దుటూరు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బెంగళూరులో జరిగిన నిరసనలో రజకులను కులం పేరుతో దూషించిన మహిళ బహిరంగ క్షమాపణ చెప్పాలని రజక వెల్ఫేర్ అసోసియేషన్ కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఏ కుల వృత్తి తక్కువ కాదని, రజక వృత్తిని కూడా గౌరవంగా చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. సంబంధం లేని విషయంలోకి తమ కులాన్ని లాగి మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం మంచిది కాదన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

బద్వేలు అర్బన్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బి.రంగనాయకులు, జి.నరసింహులు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందక్రిష్ణమాదిగ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రిలే నిరాహారదీక్ష చేపట్టారు.

విలువలకు నిలయం సేవాశ్రమం

కాశినాయన : నైతిక విలువలకు నిలువుటద్దం వివేకానంద సేవాశ్రమం అని మహాకవయిత్రి మొల్ల సాహితీపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సగిలేరు ఒడ్డున ఉన్న వివేకానంద సేవాశ్రమంలో డాక్టర్ గానుగపెంట హనుమంతరావు 77వ జన్మదిన వేడుకలను సేవాశ్రమంలోని వృద్ధులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సేవాశ్రమ వ్యవస్థాపకులు పి.రామకృష్ణారెడ్డి, రామతులసి దంపతులను సత్కరించి మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా రూ.7700 నగదు, ఆశ్రమంలోని వృద్ధులకు వస్త్రాలు, దుప్పట్లు, భోజన వసతి ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ ప్రజా చైతన్య కళా మండలి వ్యవస్థాపకులు చిర్రలింగన్న, గాలయ్య, యాదగిరి, విష్ణు, హరి బృందం ప్రదర్శించిన ఆటపాటల కార్యక్రమం ఎంతో ఆకట్టుకుంది. అనంతరం హనుమంతరావును ఆశ్రమ నిర్వాహకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో కె.నరసింహారెడ్డి, రాజారెడ్డి, రామస్వామి, గురుమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ నిర్వాహకులు రామకృష్ణారెడ్డి దంపతులను సన్మానిస్తున్న హనుమంతరావు